క్లుప్తంగా

ఘనంగా గంగమ్మ జయంతి



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

రాజుపాళెం : మండల పరిధి అర్కటవేముల గ్రామంలోని పాత గంగమ్మ ఆలయంలో మంగళవారం గంగమ్మ జయంతి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించిన అనంతరం కుంకుమార్చనలు, అభిషేకాలు, విశేష పూజలు చేశారు. అలాగే పారాయణం, భజన సంకీర్తనలతో ఆలయం మారుమోగింది. మహిళలు కాయా కర్పూరం సమర్పించి పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

22 నుంచి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు



వల్లెరవారిపల్లె లక్ష్మీనరసింహస్వామి

గోపవరం : మండల పరిధి వల్లెరవారిపల్లె గ్రామంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 22వ తేదీ నుంచి 24 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ బ్రహ్మోత్సవాల్లో 22న గణపతి హోమం, ధ్వజారోహణపూజ, 23న స్వామివారి తిరుకల్యాణం, చాందిని బండ్లు, స్వామివారి గ్రామోత్సవం, 24న బండలాగుడు పోటీలు ఉంటాయని వారు పేర్కొన్నారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలని ఆలయ పూజారి పెంచలయ్యస్వామి తెలిపారు. అన్నదానంతోపాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

16న ఆలయ భూముల వేలం

రాజుపాళెం : మండల పరిధి పగిడాల గ్రామంలోని శ్రీచెన్నకేశవ, ఈశ్వర, ఆంజనేయస్వామి ఆలయాలకు సంబంధించి 68.22 ఎకరాల కౌలుకు వేలం పాట నిర్వహించనున్నట్లు ఈఓ కె.రామచంద్రాచార్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొద్దుటూరులోని నారాయణరంగయ్యగారి సత్రంలో గురువారం ఉదయం 11 గంటలకు ఈ వేలం పాట నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. వేలం పాటలో పాల్గొనే పాటదారులంతా రూ.10 వేలు ధరావత్తు చెల్లించాలని తెలిపారు.

కురిసిన వర్షం

గోపవరం : మండలంలో సోమవారం రాత్రి ఓ మోస్తరు వర్షం కురవడంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. గత కొద్ది రోజులుగా ఎండల తీవ్రత రోజురోజుకు అధికంగా ఉండటం .. మరో పక్క ఉక్కపోతతో అల్లాడుతున్న తరుణంలో వర్షం పడటంతో కొంత ఉపశమనం కలిగింది. అంతేకాకుండా పదును వర్షం పడటంతో రైతులు భూములు దుక్కులు చేసుకునేందుకు సిద్ధపడుతున్నారు.

ఘనంగా భగీరథ మహర్షి జయంతి



భగీరథ మహర్షి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సగర సంఘం నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక నడిపంల్లెలోని సగర కార్పొరేషన్ డైరెక్టర్ కార్యాలయంలో మంగళవారం భగీరథ మహర్షి జయంతిని వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సగర కార్పొరేషన్ డైరెక్టర్ ఉప్పర మురళి.. భగీరథుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. భగీరథుడు సగరుల ఆరాధ్య దైవమని ఆయన గొప్పతనాన్ని వివరించారు. సగర సంఘం జిల్లా అధ్యక్షుడు మజ్జారి వీరమోహన్ మాట్లాడుతూ భగీరథుడు తన కఠోర తపస్సుతో దివి నుంచి భువికి గంగను తీసుకువచ్చిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో సగర సంఘం నాయకులు సీతంపల్లె రవి, పల్లవోలు అగ్గిరాముడు, కిరణ్, మజ్జారి శ్రీను, మజ్జారి లక్ష్మీనారాయణ, వెంకటరమణ, సురేష్, సీతంపల్లె విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల సంఘం ఉపాధ్యక్షుడిగా నాగరాజు

వీరపునాయునిపల్లె : ఆంధ్రప్రదేశ్ వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడిగా పాలగిరి గ్రామానికి చెందిన కన్నెలూరు నాగరాజు ఏకగ్రీవంగా ఎంపికయ్యా రు. రాష్ట్ర అధ్యక్షుడు అన్నం చిన్న సుబ్బయ్య యాదవ్ ద్వారా మంగళవారం నియామక పత్రం అందినట్లు నాగరాజు తెలిపారు. మండలంలోనే కాకుండా జిల్లాలో ఉన్న వికలాంగులు ఎవైనా సమస్యలు ఉంటే వెంటనే నా దృష్టికి తీసుకురావాలని వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

మఠం.. అభివృద్ధి పథం



భక్తుల విశ్రాంతి భవనం



శ్రీవీరబ్రహ్మ క్షేత్రం ప్రాకారం



ఆలయం వద్ద సుందరీకరణ చేపట్టిన దృశ్యం

- ఆకర్షణీయంగా వీరబ్రహ్మక్షేత్రం
- భారీగా నిధుల కేటాయింపు
- భక్తులకు సౌకర్యాల కల్పన

బ్రహ్మంగారిమఠం : జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి కాలజ్ఞాని, సంఘ సంస్కర్త, తత్త్వవేత్త, యోగి, మహిమాన్వితుడిగా కీర్తి గడించారు. ఆయన సజీవ సమాధి నిష్ఠ పొందిన ప్రదేశం బ్రహ్మంగారిమఠం. కావున ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెంది ఉండాల్సింది. అయితే ఎన్నో కారణాల వల్ల ప్రగతిలో వెనుకబడి ఉంది. దీంతో ఎంతో దూరం నుంచి ఇష్టంతో వచ్చే భక్తులు.. నిరుత్సాహంతో వెనుదిరుగుతున్నారు. స్వామి సజీవ సమాధిని దర్శించుకుని ఇంటి ముఖం పడుతున్నారు. వాస్తవానికి బ్రహ్మంగారిమఠంలో ఎన్నో ప్రాశస్త్య, దర్శనీయ స్థలాలు ఉన్నాయి. అయితే అవి కనీస వసతులకు నోచుకోకపోవడంతో.. చాలా మంది దర్శించుకోకుండానే వెళ్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కొంత కాలం నుంచి అభివృద్ధి జాడ కనిపిస్తోంది. దర్శనీయ స్థలాల్లో కొంత మార్పు గోచరిస్తోంది. కావున భక్తులు దర్శించుకుని, తరించి.. కొంచెం సంతృప్తి పొందవచ్చు. మంగళవారం నుంచి ప్రారంభమైన శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజోత్సవాలు ఈ నెల 19 వరకు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో బ్రహ్మంగారిమఠంలో జరిగిన అభివృద్ధిపై అందిస్తున్న ప్రత్యేక కథనం.

రమణీయంగా రాజగోపురం

శ్రీవీరబ్రహ్మ క్షేత్రం 7 ఎకరాల 18 సెంట్ల విస్తీర్ణంలో ఉంది. క్షేత్రం దక్షిణ ద్వారంలో ఐదు అంతస్తుల రాజగోపురాన్ని రమణీయంగా నిర్మించారు. ఉత్తర ద్వారం ఏర్పాటు చేశారు. గర్భాలయంలో గోడలకు గ్రానైట్.. ద్వారం, ఇరుపక్కల వెండి తొడుపు నిర్మాణం చేపట్టారు. స్వామి సజీవ సమాధికి వెండి తొడుపు, వెండి మకరతోరణం నిర్మించారు. కాలజ్ఞాన తాళపత్రాలకు వెండిపెట్టెలు ఏర్పాటు చేశారు. శ్రీ పోతులూరయ్య, పార్వతమ్మ, గోవిందమాంబ సమాధులకు ఇత్తడితో రుద్రాక్ష మండపం నిర్మించారు. ప్రధాన ఆలయంలో గోడలు, ఫ్లోరింగ్‌కు గ్రానైట్ ఏర్పాటు, స్తంభాలకు ఇత్తడి తొడుగు ఏర్పాటు చేశారు. భక్తుల విడిది కోసం వీరగురు, గోవిందమాంబ సదనంలు నిర్మించారు. శాశ్వత నిత్య అన్నదాన పథకం నిర్వహిస్తున్నారు. ఇందుకోసం డైనింగ్ హాల్ నిర్మాణం చేపట్టారు. మఠం పార్కులో టూరిజం వారిచే పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో రూ.కోటి 68 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టారు. స్వామి వారి 21 అడుగుల విగ్రహాన్ని శోభాయమానంగా ఏర్పాటు చేశారు. శివాలయం, కల్యాణ మండపం, అలంకార మండపం, మహానివేదన మందిరం, బ్రహ్మరథం, టీటీడీ సత్రం పునరుద్ధరించారు. బ్రహ్మరథానికి రథశాల, క్యూకాంప్లెక్స్, మఠం పక్కన ఉన్న వంకకు కాజ్‌వే నిర్మించారు. ఆలయ ప్రాంగణాన్ని గ్రానైట్ బండపరుపుతో తీర్చిదిద్దారు. గణపతి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. ఈ పనులన్నీ మఠాధిపతుల ఆధ్వర్యంలో జరిగాయి. సుదీర్ఘ కాలం మఠాధిపతిగా ఉన్న శ్రీ వీరభోగ వసంత వెంకటేశ్వరస్వామి నేతృత్వంలో ఎక్కువగా చేపట్టారు.

భారీగా ప్రాకార నిర్మాణం

మఠం ఫిట్‌పర్సన్‌గా దేవదాయ శాఖ ఏసీ సి.శంకర్‌బాలాజీ బాధ్యతలు చేపట్టిన తర్వాత అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. అప్పటికే జరుగుతున్న పనులను పూర్తి చేయడంతోపాటు కొత్త వాటికి శ్రీకారం చుట్టారు. ఇందుకోసం భారీగా నిధులు కేటాయించారు. వీటిలో ప్రభుత్వ, మఠం నిధులు ఉన్నాయి. స్వామి నివాస గృహ ప్రాకారం గోడ, రాజగోపురాన్ని రూ.29 లక్షల 50 వేలతో నిర్మించారు. మఠం ఆవరణలోని టీటీడీ అతిథి గృహం సమీపంలో రూ.24 లక్షలతో కల్యాణ కట్ట నిర్మించారు. రూ.65 లక్షల 25 వేలతో మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. టీటీడీ అతిథి గృహం సమీపంలో ఫ్లోరింగ్‌ను రూ.47 లక్షలతో చేపడుతున్నారు. వీఐపీల కోసం అతిథి గృహాన్ని రూ.19 లక్షలతో నిర్మిస్తున్నారు. గోకులంను రూ.20 లక్షలతో నిర్మించడం జరిగింది. రూ. 80 లక్షలతో డార్మెంటరీ హాల్ నిర్మిస్తున్నారు. ధ్వజస్తంభాన్ని అట్టహాసంగా పునః ప్రతిష్ఠించారు. ఆలయ ఉత్తరం వైపు ఫ్లోరింగ్, వంక సుందరీకరణ పనులు రూ.76 లక్షలతో చేపట్టారు. శాశ్వత విద్యుద్దీకరణ కోసం హైమాస్ లైటింగ్‌ను రూ.44 లక్షలతో ఏర్పాటు చేశారు. నైరుతి వైపు గాల్వనైజ్డ్ షీట్‌షెడ్‌ను రూ.98 లక్షలతో భారీగా ఏర్పాటు చేస్తున్నారు. తిరుపతి, శ్రీశైలం దేవస్థానాల వలే మఠం చుట్టూ పెద్ద రాళ్లతో ప్రాకారం నిర్మిస్తున్నారు. మఠం ప్రాకారం గోడ, పోలేరమ్మ దేవస్థానంలో డార్మెంటరీ హాల్‌ను రూ.కోటి 25 లక్షలతో నిర్మిస్తున్నారు. రక్షణ గోడ వెనుక షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించనున్నారు.

పోలేరమ్మ దేవస్థానంలో..

శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి మఠం పరిధిలోని పోలేరమ్మ దేవస్థానాన్ని అందంగా తీర్చిదిద్దారు. మండపం, ప్రాకారం గోడ నిర్మాణాన్ని రూ.89 లక్షల 50 వేలతో పూర్తి చేశారు. ఆవరణలో వంటశాల, డైనింగ్ హాల్ నిర్మాణాన్ని రూ.22 లక్షల 50 వేలతో చేపట్టారు. ఆలయ ముఖద్వారాన్ని రూ.7 లక్షల 27 వేలతో నిర్మిస్తున్నారు. రూ.30 లక్షలతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు చేశారు. రూ.88 లక్షలతో రక్షణ గోడ నిర్మించారు. టాయ్‌లెట్ బ్లాక్‌ను 42 లక్షల 50 వేలతో నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. మొత్తం పనులను రూ.9 కోట్ల 9 లక్షలతో చేస్తున్నారు. వీటివతో భక్తులకు సౌకర్యాలు సమకూరనున్నాయి.

నిరంతర పర్యవేక్షణ



ఆన్‌లైన్ టెండర్ల ద్వారా పనులు చేపడుతున్నాం. కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకుంటున్నాం. నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. దేవాలయాన్ని అభివృద్ధి చేయాలనే తపనతో పని చేస్తున్నాం. దాతలు, భక్తులు సహకరించాలి.

– సి.శంకర్‌బాలాజీ, ఫిట్‌పర్సన్, శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి మఠం

ప్రైవేటు ట్రావెల్స్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి



ఆర్టీఓకు వినతి పత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

ప్రొద్దుటూరు : ప్రైవేటు ట్రావెల్స్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఆర్టీఓ మురళీధర్‌కు సీపీఐ ఏరియా కార్యదర్శి పి.సుబ్బరాయుడు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సుబ్బరాయుడు మాట్లాడుతూ హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి సుదూర ప్రాంతాల నుంచి ఓట్లు వేసేందుకు వస్తున్న ప్రయాణికులను ప్రైవేటు ట్రావెల్స్ యాజమాన్యం దోపిడీకి పాల్పడుతోందన్నారు. రూ.2,500 నుంచి రూ.4 వేల వరకు ఆన్‌లైన్‌లో టికెట్ల ధరలను పెట్టి ప్రయాణికులను దోచుకుంటున్నారని తెలిపారు. పండుగ సీజన్లలో కూడా ఇదే తంతన్నారు. ఒకే నంబర్‌పై రెండు, మూడు బస్సులు తిప్పుతున్నారని ఆరోపించారు. ప్రొద్దుటూరు నుంచి విజయవాడకు ఆర్టీసీ లింకు బస్సులను ఏర్పాటు చేయడం మూలంగా డైరెక్ట్ బస్సులు లేక ప్రైవేటు ట్రావెల్స్ వారిని ఆశ్రయించాల్సి వస్తోందన్నారు. దీంతో ట్రావెల్స్ యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా టికెట్ల ధరలను పెంచి ప్రయాణికుల జేబులకు చిల్లులు వేస్తున్నారన్నారు. అధికారులు విచారణ చేసి ప్రైవేటు ట్రావెల్స్ యాజమాన్యం దోపిడీని అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు హరి, ప్రమీల పాల్గొన్నారు.

కడప నియోజకవర్గంలో 144 సెక్షన్

- జూన్ 6 వరకు అమలు
- కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్

కడప అర్బన్: కడప అసెంబ్లీ నియోజక వర్గ పరిధిలో ఈనెల 14 వ తేదీ ఉదయం నుంచి జూన్ 6వ తేదీ వరకు జిల్లా ఎన్నికల అధికారి (జిల్లా కలెక్టర్) జారీ చేసిన ఉత్తర్వుల మేరకు సెక్షన్ 144 అమలులో వుంటుందని కడప డీఎస్పీ ఎండి. షరీఫ్ ఒక ప్రకటనలో తెలియజేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతలను పరిరక్షించడానికి, ఎన్నికల నిర్వహణలో అవాంఛనీయ సంఘటనలను నివారించడం కోసం కడప నియోజక వర్గ పరిధిలోని కౌంటింగ్ సెంటర్‌గా గుర్తించిన మౌలానా అబ్దుల్ కలాం నేషనల్ ఉర్దూ యూనివర్శిటీ (ఎంఎన్‌యుయు) పరిసర ప్రాంతంలో సెక్షన్ 144 అమలులో వుంటుందని తెలిపారు. ఈనెల 31 వరకు కడప పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ కూడా అమలులో వుందని గుర్తు చేశారు. సభలు, సమావేశాలు, ర్యాలీలు, నిరసన కార్యక్రమాలు చేపట్టాలంటే 24 గంటల ముందు లిఖితపూర్వకంగా పోలీసు వారికి అర్జీ ఇచ్చి వారి నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. అలా కాని పక్షంలో చట్టపరమైన చర్యలకు బాధ్యులవుతారని ఆయన హెచ్చరించారు.

ఫ్యాన్ గుర్తుకే పట్టం కట్టిన ప్రజలు

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



ప్రొద్దుటూరు : జగనన్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కారణంగా ప్రజలంతా మళ్లీ ఫ్యాన్ గుర్తుకే పట్టం కట్టినట్లు స్పష్టమవుతోందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. స్థానిక వైఎంఆర్ కాలనీలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి కార్యాలయంలో ఎమ్మెల్యే విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మళ్లీ గెలవబోతోందని చెప్పడానికి సంతోషస్తున్నామన్నారు. 80 శాతం మంది ఓట్లు వేసి ప్రజాస్వామ్యాన్ని గెలిపించారని తెలిపారు. 2,48,000 ఓట్లకుగాను దాదాపు లక్షా 97 వేల మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని, ఎక్కువ శాతం మంది యువత తొలిమారు ఓటు వేశారన్నారు. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా 6.30 గంటలకే చాలా చోట్ల మహిళలు తమ కుటుంబ బాధ్యతలను నెరవేర్చుకుని ఓటు హక్కు కోసం క్యూలైన్‌లో నిలబడ్డారన్నారు. ఎన్నికలు సక్రమంగా నిర్వహించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

టూటౌన్ ఎస్ఐ ఏకపక్షంగా వ్యవహరించాడు

టూటౌన్ ఎస్ఐ రామకృష్ణ ఎన్నికల సందర్భంగా ఏకపక్షంగా వ్యవహరించాడని ఎమ్మెల్యే ఆరోపించారు. సంజీవనగర్ హాస్టల్‌లో 7, 8 వార్డులకు సంబంధించి ఎన్నికలు నిర్వహించారన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ రామకృష్ణ టీడీపీ నాయకులకు అనుకూలంగా వ్యవహరించాడన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, ఏజెంట్లను బెదిరించి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డాడన్నారు. తమ పార్టీ కార్యకర్తలను ఆ సందర్భంగా తరిమికొట్టడం, పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లడం జరిగిందన్నారు. టూటౌన్ ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎన్నికల కమిషన్‌తోపాటు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. మిగతా అధికారులందరూ నిష్పక్షపాతంగా విధులు నిర్వహించి, శాంతి భద్రతలను పర్యవేక్షించారన్నారు.

కార్యకర్తలు, నాయకులకు కృతజ్ఞతలు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం కోసం పార్టీ కార్యకర్తలు, నాయకులతోపాటు పోలింగ్ ఏజెంట్లు చివరి వరకు శ్రమించారని తెలిపారు. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రి చేయాలని పార్టీ క్యాడర్ అంతా తపించి పని చేసిందన్నారు. మళ్లీ వైఎస్సార్‌సీపీని గెలిపించేందుకు పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారు, యువకులు కృషి చేశారన్నారు. తాను చేపట్టిన మార్కెట్, బస్టాండ్, పెన్నానదిపై బ్రిడ్జి నిర్మాణం లాంటి పనులను ప్రజలు గుర్తించి తనకు ఓట్లు వేశారని భావిస్తున్నానన్నారు. మళ్లీ ఎమ్మెల్యేను గెలిపిస్తేనే అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు సాగుతాయని భావించినట్లు తెలుస్తోందన్నారు. ఏది ఏమైనా జూన్ 4వ తేదీ ప్రజా తీర్పు వెలువడేంత వరకు అందరం వేచి చూడాల్సిందేనన్నారు.

వెల్లివిరిసిన మహిళా చైతన్యం

రాజుపాళెం : మహిళా చైతన్యం వెల్లివిరిసింది. సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మండలంలో మహిళల ఓటింగ్ అత్యధిక శాతం నమోదైంది. వారు తమ ఓటు హక్కు వినియోగించడానికి ఉత్సాహం ప్రదర్శించారు.

బూత్ నంబరు	గ్రామం పేరు	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పోలింగ్ నమోదైన శాతం
1	గోపాయపల్లె	834	785	94.12
2	వెల్లాల	734	675	91.96
3	పైడాల	814	749	92.01
4	కూలూరు	907	833	91.84
5	ఉప్పలపాడు	235	219	93.19
6	దద్దనాల	221	200	90.50
7	కొట్టాల	338	327	96.75
8	గాదెగూడూరు	882	783	88.78
9	గాదెగూడూరు	740	646	87.30
10	టంగుటూరు	1041	915	87.90
11	టంగుటూరు	1208	1086	89.90
12	టంగుటూరు	547	518	94.70
13	వెంగళాయపల్లె	599	561	93.66
14	అయ్యవారిపల్లె	238	223	93.70
15	రాజుపాళెం	1201	1037	86.34
16	రాజుపాళెం	813	728	89.54
17	అర్కటవేముల	921	841	91.31
18	అర్కటవేముల	879	821	93.40
19	సోమాపురం	417	393	94.24
20	పర్లపాడు	999	909	90.99
21	పర్లపాడు	623	571	91.65
22	ఏరువపాళెం	640	576	90
23	తొండలదిన్నె	715	671	93.85
24	చిన్నజోన్నవరం	667	620	92.95
25	వాసుదేవాపురం	1118	1011	90.43
26	వెలవలి	994	873	87.83
27	వెలవలి	1014	875	86.29
28	కొర్రపాడు	1145	1050	91.70
29	కొర్రపాడు	829	729	87.94
30	కొర్రపాడు	769	710	92.33
31	కొర్రపాడు	656	602	91.77
32	చిన్నశెట్టిపల్లె	951	879	92.43
33	పొట్టిపాడు	457	443	96.94
మొత్తం		25146	22859	90.91

భక్తిశ్రద్ధలతో జ్యోతి ఉత్సవం



ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరిదేవి

చిన్నమండెం : మండల పరిధిలోని దేవగుడిపల్లె గ్రామ పంచాయతీలోని కొండమూల గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరీదేవి ఉత్సవాలను మంగళవారం రాత్రి తొగటవీర క్షత్రియ సంఘం వారిచే అంగరంగ వైభవంగా నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తెలిపారు. మంగళవారం ఉదయం అమ్మవారికి అభిషేకాలు, పూజలు నిర్వహించి సాయంత్రం 4 గంటల నుంచి జ్యోతులను తయారు చేశారు. ఈ జ్యోతులను శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారిని రాత్రి 9 గంటల నుంచి సింహ వాహనంపై కొలువుదీర్చి ఊరేగించనున్నారు. అలాగే అగ్నిగుండ ప్రవేశం కార్యక్రమం చేయనున్నారు. కార్యక్రమానికి వివిధ రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున తొగట వీర క్షత్రియ సంఘం కుటుంబ సభ్యులు, భక్తాదులు వేలాదిగా పాల్గొన్నారు.

గ్రామాల్లో 90 శాతంపైగా పోలింగ్

- 2,47,966 ఓట్లకు 1,97,349 నమోదు
- నియోజకవర్గంలో 79.59 శాతం పోలింగ్



ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్న ఓటర్లు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు నియోజకవర్గానికి సంబంధించి ప్రొద్దుటూరు మున్సిపాలిటీ కంటే గ్రామాల్లోనే పోలింగ్ 90 శాతంపైగా నమోదైంది. ఇంత పెద్ద ఎత్తున ఓటింగ్ నమోదు కావడంపై సర్వత్రా చర్చనీయాంశమైంది. నియోజకవర్గంలో మొత్తం 2,47,966 ఓటర్లు ఉండగా, వీరిలో 1,19,985 మంది పురుషులు, 1,27,933 మంది మహిళలు, ట్రాన్స్ జెండర్లు 48 ఉన్నారు. వీరిలో పురుషులు 95,260, మహిళలు 1,02,062, ట్రాన్స్ జెండర్లు 27 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం 1,97,349 ఓట్లు పోలై 79.59 శాతం ఓటింగ్ నమోదైంది. ప్రొద్దుటూరు మండలంలోని చౌడూరులో 90.61శాతం, కాకిరేణిపల్లెలో 92.83, పెద్దశెట్టిపల్లెలో 91.76, నరసింహాపురంలో 91.43, కొత్తపేటలో 92.43, శంకరాపురంలో 90.54, దొరసానిపల్లెలో 90.24, మీనాపురంలో 90.54, చెన్నమరాజుపల్లెలో 93.99, నక్కలదిన్నెలో 90.72, ఖాదర్‌బాద్‌లో 90.57, రేగుళ్లపల్లెలో 95.06, సీతంపల్లెలో 92.66, నంగనూరుపల్లెలో 90.35, సగిలిగొడ్డుపల్లెలో 93.45 శాతం ఓటింగ్ జరిగింది. ప్రొద్దుటూరు మండలంలో అత్యల్పంగా కొత్తపల్లెలో 254 పోలింగ్ స్టేషన్‌లో 788 ఓట్లకు 502 నమోదు కావడంతో 63.71 శాతం, 254ఏ పోలింగ్‌స్టేషన్‌లో 943 ఓట్లకు 651 నమోదు కావడంతో 69.03 శాతం పోలింగ్ నమోదైంది. గోపవరం పరిధిలోని 222 పోలింగ్‌స్టేషన్‌లో 1274 ఓట్లకు 851 నమోదు కావడంతో 66.80 శాతం పోలింగ్ నమోదైంది. మున్సిపాలిటీ పరిధిలో 62వ పోలింగ్ స్టేషన్‌లో 1273 ఓట్లకు 782 నమోదు కావడంతో 61.43 శాతం మాత్రమే పోలింగ్ నమోదైంది.

కైఫియత్తులే ఇంటిపేరుగా 'కట్టా'

కడప కల్చరల్ : కైఫీయత్తుల పరిష్కర్తగా విద్వాన్ కట్టా నరసింహులు ఖ్యాతిగడించారు. నిజానికి ఆయన సాహితీవేత్తగా కంటే 'కైఫియత్తుల కట్టా'గానే తెలుగు వారికి సుపరిచితులు. బుధవారం ఆయన వర్ధంతి సందర్భంగా ఆయన గురించి..

■ ఒంటిమిట్ట సమీపంలోని కొత్తపల్లి కు చెందిన కట్టా నరసింహులు తెలుగు పండితుడిగా సేవలందించారు. కొన్ని అవధానాలు చేశారు. డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రితో పరిచయం కట్టా పదవీ విరమణ తర్వాత ఆయనను సీపీ బ్రౌన్ గ్రంథాలయానికి చేర్చింది. భాష, పరిశోధనలపై కట్టాకుగల ఆసక్తిని గమనించిన జానమద్ది బ్రౌన్ గ్రంథాలయ తాళపత్ర గ్రంథాల విభాగాన్ని పటిష్టం చేసే బాధ్యతను, ఆ తర్వాత మెకంజీ రాసిన కడప కైఫియత్తుల పరిష్కార బాధ్యతను అప్పగించారు. 8 సంపుటాలు 3000 పైచిలుకు పేజీలతో వాటిని పరిష్కరించి వాటి సారాంశాన్ని అందుబాటులోకి తెచ్చారు కట్టా. ఎనిమిదేళ్లపాటు జిల్లా చరిత్రలో మరుగున పడిన పలు చారిత్రిక అంశాలను వెలికితీసిన ఆయన కడప కైఫియత్తుల ఆధారంగా 'కైఫియత్ కథలు' పేరిట పుస్తకం వెలువరించారు.

ఓటమి భయంతోనే ఏజెంట్లపై టీడీపీ దాడులు

ఎమ్మెల్సీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే సుధ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే సుధ

బద్వేలు అర్బన్ : బద్వేలు నియోజకవర్గంలో సోమవారం జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలవబోతోందన్న సంకేతాలు వెల్లడంతో ఓటమి భయంతోనే ఏజెంట్లపై టీడీపీ నాయకులు దాడి చేశారని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధి చిన్న కేశంపల్లె గ్రామంలోని 179 బూత్ పరిధిలో సోమవారం ఏజెంట్లపై టీడీపీ నాయకులు చేసిన దాడిని ఖండిస్తూ మంగళవారం స్థానిక నెల్లూరు రోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో రౌడీయిజంతో గెలవాలని చూడటం అవివేకమని అన్నారు. బూత్ పరిధిలో టీడీపీ నేతలు పోలింగ్ ప్రారంభమైనప్పటి నుంచి కవ్వింపు చర్యలతో బెదిరింపులకు, అరాచకాలకు తెగబడ్డారని, తమ ఏజెంట్లు లొంగకపోవడంతో చివరకు దాడులకు పాల్పడ్డారని అన్నారు. ఓటు వేయడానికి బూత్‌లోకి వెళ్లిన టీడీపీ నాయకుడు రితీష్‌రెడ్డి, ఆయన అనుచరులు 20 నిమిషాల పాటు తమ పార్టీ ఏజెంట్లపై దాడి చేస్తుంటే పోలీసులు సైతం ప్రేక్షకపాత్ర వహించారని అన్నారు. చిన్నకేశంపల్లె గ్రామానికి చెందిన తమ పార్టీ నాయకుడు కేశవరెడ్డి టీడీపీ నాయకుల దౌర్జన్యాలను ముందే గమనించి రక్షణ కల్పించాల్సిందిగా జిల్లా కలెక్టర్, ఆర్‌ఓకు వినతిపత్రం సమర్పించినప్పటికీ ఎవరూ కూడా స్పందించలేదని అన్నారు. అంతేకాకుండా రితీష్‌రెడ్డి ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా పట్టణంలో 5 వాహనాలలో తన అనుచరులతో పోలింగ్ కేంద్రాల వద్దకు వస్తున్నప్పటికీ ఏ ఒక్కరూ అడ్డుకోకపోవడం దారుణమన్నారు. 2000కు ముందు జరిగిన ఎన్నికల్లో తాత వీరారెడ్డి ఏవిధమైన ట్రెండ్‌ను అనుసరించారో ఆయన మనవడు రితీష్‌రెడ్డి కూడా అదే ట్రెండ్‌ను ఫాలో అవుతున్నాడని, బూత్ క్యాప్చర్ చేసే అలవాటు తాత నుంచి మనవడికి వచ్చినట్లుందని తెలిపారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామని, అధికారులు స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అంతకుముందు చిన్నకేశంపల్లె గ్రామానికి వెళ్లి బాధితులైన వార్డు ఇన్‌చార్జి కేశవరెడ్డి, ఏజెంట్లు మల్లికార్జునరెడ్డి, రవీంద్రలను పరామర్శించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, కుడా చైర్మన్ గురుమోహన్, వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు సుందర్‌రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు రామసుబ్బారెడ్డి, పోలిరెడ్డి, నాయకులు పుత్తాశ్రీరాములు పాల్గొన్నారు.